మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం

- పట్టించుకోని అధికారులు
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

ధర్మారం: మండల కేంద్ర ప్రజలకు మిషన్ భగీరథ మంచినీటిని అందించే పైప్‌లైన్లు రోడ్డు పనులు చేస్తుండగా ధ్వంసమై నీటి సరఫరా నిలిచిపోయింది. ధర్మారంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లు తరచుగా ధ్వంసం కావడంతో మంచినీటి సమస్య ఏర్పడుతోంది. రెండునెలల క్రితం పశువైద్యశాల సమీపంలో ట్రాన్స్‌కో అధికారులు నూతనంగా మిడిల్ పోల్స్ వేయడానికి మిషన్ సాయంతో గోతి తీస్తుండగా పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో ఈ పైప్‌లైన్ మరమ్మతు పనులు చేయడానికి గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదు. దాదాపు 20రోజులు గ్రామం మొత్తానికి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఆ తర్వాత కొన్నిరోజులకు జంబి గద్దె వద్ద నీటి ప్రెషర్‌తో ప్రమాదవశాత్తు పైప్‌లైన్ పగిలిపోగా పంచాయతీ సిబ్బంది కేవలం నాలుగు రోజుల్లోనే మరమ్మతు చేసి నీటి సరఫరా చేశారు. కాగా కాంట్రాక్టర్ రోడ్డు వెడల్పు చేస్తున్న క్రమంలో జేసీబీతో పనులు చేస్తుండగా పైప్‌లైన్ ధ్వంసమై నీరు సరఫరా నిలిచిపోయింది. అయితే ఈ పగిలిపోయిన పైప్‌లైన్ మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి మంచినీటి సరఫరా చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


పైకి చిమ్ముతున్న మిషన్ భగీరథ నీరు

‘కాంగ్రెస్ పాలనతో ఒరిగిందేమీలేదు’

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఎలిగేడు మండలం రాములపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారే తప్ప అభివృద్ధిపై ధ్యాస పెట్టలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెలకు పట్టణశోభ సంతరించుకునేలా అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. నాయకులు బత్తుల సారయ్య, గంట రాజయ్య, లచ్చయ్య, బుచ్చయ్య, కుమార్, లక్ష్మణ్, వెంకట్, రాములు,రాయమల్లు తో పాటు లక్ష్మణ్, తిరుపతి, బైరెడ్డి రాంరెడ్డి, కాసర్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

అభివృద్ధి నచ్చి బీఆర్ఎస్‌లోకి..


పార్టీ కండువా కప్పుతున్న జెడ్పీచైర్మన్ మధు

మంథని: సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నచ్చి అనేక మంది బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. శనివారం మంథనికి చెందిన ఎస్వీఆర్ వెంకటేష్, దూడపాక దామోదర్, ప్రేమ్, సాయికృష్ణ, శివతేజ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ తదితరులు ఉన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్ఎస్ నిరంకుశ పాలనపై ప్రజలు తిరగబడాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం మియాపూర్, పెర్కపల్లిలో శనివారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అవినీతికి కేరాఫ్‌గా మారారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌రావు, చిలుక సతీష్, పోచాలు, సాయిలు, లచ్చయ్య, సునిల్, తిరుపతి తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేటకు చెందిన పలువురు మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి విజయరమణారావు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. మూల మొగిలి, అజయ్, సునిల్, తిరుపతి, రోహిత్, రాకేశ్, అభిషేక్, అనిల్, కుమార్, రంజిత్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న విజయరమణారావు

లోక్‌సభ స్థానం స్థానిక మాదిగలకే కేటాయించాలి

సుల్తానాబాద్: రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని స్థానిక మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికే కేటాయించాలని మాజీ ఎంపీపీ కవ్వంపల్లి దుర్గయ్య కోరారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో 2.80లక్షల ఓటర్లు మాదిగ సామాజిక వర్గం ఉన్నారని, స్థానిక మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా వేరే ప్రాంతాల నుంచి వలస వస్తున్న ఎస్సీ సామాజిక వర్గంలోని ఇతర నాయకులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. పార్లమెంటు పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో ఎస్సీ సామాజిక మాదిగ వర్గాన్ని చైతన్యం చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. 20న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగ వర్గాలు అన్ని పార్టీలలో ఉన్న ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. నాయకులు పల్లె సదానందం ,కవ్వంపల్లి చంద్రయ్య, ప్రభాకర్, రమేష్, రాకేశ్ ఉన్నారు.

సమరయోధుల కుటుంబాలకు సన్మానం

మంథని: మన మట్టి మనదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం మంథనిలోని గాంధీచౌక్‌లో స్వాంతంత్ర్య సమరయోధుల కుటుంబాలను మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. రజాకార్ల పోరాటంలో మంథని నుంచి ఎంతోమంది పాల్గొన్నారని, వారి త్యాగం గొప్పదని పేర్కొన్నారు. మంథని మట్టిపై ఉన్న ప్రేమ అమెరికా నుంచి ఇక్కడకు రప్పించిందని చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్, నాయకులు నాంపల్లి రమేష్, ఎడ్ల సదాశివ్, కొండపాక సత్యప్రకాశ్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అంతర్గత రహదారులు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్

రామగుండం: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధిలోని రామ్‌నగర్, జీరోపాయింట్ తదితర కాలనీల్లోని అంతర్గత రహదారులు బురదమయంగా మారడంతో కాలనీవాసులు కనీసం నడిచేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ‘అంతర్గత రోడ్లు బురదమయం’ అనే శీర్షికతో ‘సాక్షి’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్థానిక కార్పొరేటర్ కౌశిక లత స్పందించి పారిశుధ్య సిబ్బందితో కాలనీల్లోని అంతర్గత రహదారులపై పేరుకుపోయిన బురదను బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించారు. కాలనీవాసులు ‘సాక్షి’ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

రామగుండం: పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలోని సుబోధ్ స్కూల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈ నెల 6న ‘పొంచి ఉన్న ప్రమాదం’ అనే శీర్షికతో ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పారిశుధ్య సిబ్బందితో ట్రాన్స్‌ఫార్మర్ కంచె లోపల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. స్థానికులు సాక్షి దినపత్రికకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్, మెయిన్‌రోడ్, కమాన్‌రోడ్, బేగ్‌రోడ్, కూనారం రోడ్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఏడీఈ సత్యనారాయణ కోరారు.

గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి


నివాళి అర్పిస్తున్న విప్లవ కార్మిక సంఘాల జేఏసీ

గోదావరిఖని: గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని విప్లవ కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం గద్దర్ సంతాప సభ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ప్రజాయుద్ధనౌక గద్దర్‌లేని మరణం విప్లవ ఉద్యమానికి తీరనిలోటన్నారు. నాయకులు రియాజ్‌అహ్మద్, ఐ.క్రిష్ణ, గట్టయ్య, జి.రాములు, రామకృష్ణ, రవీందర్, తోట వేణు, నరేశ్, రాజన్న, పోచమల్లు పాల్గొన్నారు.

గ్రూపు–2 వాయిదా వేయాలని నిరసన


సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తలపెట్టిన నిరసన దీక్షను భగ్నం చేసి ఆయనను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద రాజీవ్‌రోడ్డుపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరుద్యోగ యువతకు మద్దతుగా హైదరాబాద్‌లో బీఎస్పీ తలపెట్టిన నిరసన దీక్షను పోలీసులతో ప్రభుత్వం భగ్నం చేయించిందని ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. నాయకులు రాజు, స్వప్న, వెంకటేశ్, రాజనర్సయ్య, బాబు, నరేశ్, తిరుపతి, ప్రసన్నకుమార్, రాకేశ్, దుర్గయ్య, గోపాల్, అనిల్, ఎండీ రియాజ్, శోభ, అరుణ, శారద, రాహుల్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: గ్రూప్2 పరీక్ష వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, రవీందర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలు భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నాయకులు విజ్ఞాన్, శశి ధర్, రాజ్‌కుమార్, రాజు, రఘు, శ్రీవాత్సవ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

పెద్దపల్లిరూరల్: పీఆర్సీ గడువు జూన్ నెలాఖరుతో ముగిసినా కమిటీ ఏర్పాటు చేయలేదని, వెంటనే కమిటీ వేయాలని నివేదిక వచ్చే దాకా మధ్యంతర భృతి ఇవ్వాలని స్టీరింగ్ కమిటీ నాయకులు గోల్కొండ శ్రీధర్, రాజమౌళి, బి.శ్యాం డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు ఎన్నికల కోడ్ అమలుకు ముందే పూర్తి చేయాలని కోరారు. ఉపాధ్యాయ పోరాట సంఘం నాయకులు కాంపల్లి లక్ష్మణ్, గద్దె శ్రీనివాస్, పోచయ్య, రామ్‌కిషన్ రావు, సంతోష్‌రెడ్డి, బోయిన కిరణ్, కుమార్, ప్రవీణ్, సుధాకర్‌రెడ్డి, స్వామి, రవీందర్, కనకయ్య, కిషోర్‌కుమార్, రమేశ్, ప్రకాష్‌రావు, శంషుద్దీన్, రాజ్‌కుమార్, సాంబయ్య, రాజేశ్వరి, రాజేశం, సతీశ్, కిషన్‌రెడ్డి, స్వరూప్‌చంద్, స్వామి, చంద్రమౌళి, దశరథం, నంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్


జెండా ఎగురవేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్ ఉంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రేణుకుంట ప్రీతం అన్నారు. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని మార్కండేయకాలనీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 88వ ఆవిర్భావ దినోత్సవం శనివారం జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిందన్నారు. రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు ఎల్కపల్లి సురేశ్, కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మార్కపూరి సూర్య, నాయకులు గుడిసెల ప్రణీత్, వినయ్, వంశీ, రాజు, భాస్కర్, వినీత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం


ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎలిగేడు: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని రాముపల్లిలో ఇంటింటా కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, దళిత బంధు, బీసీబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్ పథకాలు ప్రవేశపెట్టారని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కవ్వంపల్లి బాపయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు న్యాతరి పోచయ్య, విద్యార్థి సంఘం అధ్యక్షుడు బాసంపల్లి వినోద్, నాయకులు మద్దెల సంపత్, రమేశ్, పూర్ణచందర్, రంజిత్, లక్ష్మన్, జల్లి రమేశ్, చెవుల అజయ్ పాల్గొన్నారు.

వంటావార్పుతో స్వీపర్ల నిరసన


రోడ్డుపై వంట చేస్తున్న నాయకులు, స్వీపర్లు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు శనివారం ప్రధాన రోడ్డుపై వంటావార్పు, సహపంక్తి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. కాగా శనివారం జరిగిన నిరసన కార్యక్రమానికి యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీధర్, లక్ష్మణ్, కుమారస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకుడు రవీందర్ మద్దతు తెలిపారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అటెండర్ పోస్టుల్లో పార్ట్‌టైం స్వీపర్లను నియమించాలని డిమాండ్ చేశారు. వేతనాలను పెంచాలని కోరారు. యూనియన్ నాయకులు జ్యోతి, వెంకటస్వామి, లక్ష్మయ్య, రాయలింగు, చినరాజయ్య, లక్ష్మి, స్వామి, అనసూయ, లింగయ్య, చంద్రమౌళి, కనకయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల, రత్నాపూర్ గ్రామాలకు చెందిన ఒర్రె కుమార్ రూ.60వేలు, కొండపర్తి అమరేందర్‌కు రూ.24వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట చంద్రయ్య, బర్ల శ్రీనివాస్, చిందం మహేశ్, ఉడుత శంకర్, కాటం సత్యం, కండె పోషం, మట్ట రాజ్‌కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని మైదబండ, పోతారం గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత శనివారం అందజేశారు. మైదబండకు చెందిన ఎర్రం మల్లయ్యకు రూ.24వేలు, పోతారం గ్రామానికి చెందిన నెత్తెట్ల ప్రియ, మాధవికి రూ.20వేలు, సౌందర్యకు రూ.16వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, సర్పంచులు నెత్తెట్ల మహేందర్, ఎర్రం శారద, ఎంపీటీసీ బియ్యని శ్యామల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానమే కావాలి


హైదరాబాద్‌కు తరలుతున్న సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు పర్చాలని ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్ అన్నారు. టీఎస్ సీపీఎస్ఈయూ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. సంఘ నాయకులు అజయ్, విజయకుమార్, కుమార్, సుధాకర్, సదాశివ, రాజేందర్, శ్రీనివాస్, విద్యాసాగార్, సంపత్, వెంకటేష్, రాజమణి, ప్రసుమతి, శారద, నవనీత, నాగరాజు, రాజిరెడ్డి, రఘు రాజమల్లు, రాజు, లక్ష్మిపతి, తిరుపతి, ఆనందరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీధర్‌బాబు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న తొట్ల తిరుపతియాదవ్

కమాన్‌పూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పని చేయాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీఆదివరాహస్వామి ఆలయ కమ్యూనిటీ హాల్లో శనివారం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తిరుపతియాదవ్ మాట్లాడుతూ 3వేలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతీ కార్యకర్త గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు బాద్రపు శంకర్, గాండ్ల మోహన్, భూంపెల్లి రాజయ్య, కుందారపు బాపు, అస్సర్, ఒడ్నాల శ్రీనివాస్, ముస్తాక్, రఫీక్, రాజు, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



సుల్తానాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు పలు కాలనీల్లో రోడ్లపై గుంతలు పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, గుంతల్లో నీటి నిల్వ ఉండడంతో దోమలు పెరుగుతున్నాయని కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యంసునీత ప్రత్యేక చొరవ తీసుకొని శనివారం గుంతల్లో మట్టిపోయించి ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్నారు.

‘హౌస్ అరెస్టులను ఖండిస్తున్నాం’

రామగుండం: గ్రూపు–2 పరీక్ష వాయిదా వేయాలని అఖిల భారత పక్షం ఆధ్వర్యంలో 8న మౌన దీక్ష చేయాలని నిర్ణయించగా ప్రభుత్వం స్పందించి ముందుగానే ప్రొఫెసర్ కోదండరాం, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితర పార్టీల నాయకులను అక్రమంగా హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన అంతర్గాంలో విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటమాడిందని విమర్శించారు. సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇష్టానుసారంగా ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటిస్తూ నిరుద్యోగులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు.

‘చలో కోరుట్ల’ సభకు తరలిరావాలి

రామగిరి: కోరుట్లలో 13న జరగనున్న పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి ఆత్మగౌరవ సభకు డివిజన్‌లోని పద్మశాలీ సోదరులు అందరూ తరలిరావాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సత్తయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తమ సంఖ్యకు సరిపడా సీట్లను రాజకీయ పార్టీలు కేటాయించాలని, పద్మశాలీలకు ఆర్థికంగా చేయూతనిచ్చే పథకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యవర్గ సభ్యులు బండారి సదానందం, నాయకులు కొలిపాక సారయ్య పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

సుల్తానాబాద్: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన నిరుపేద పద్మకు నిత్యావసర వస్తువులను లయన్స్ ప్రతినిధులు, మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ అందజేశారు. అధ్యక్షులు దీకొండ భూమేశ్‌కుమార్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, వలస నీలయ్య సౌజన్యంతో రూ.2500నగదుతో పాటు నెలరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, కోశాధికారి రాయేల్ల నవీన్, పూసాల సాంబమూర్తి, పాండురంగ, పట్టణ కార్యదర్శి పర్శరాములు, స్వామి ఉన్నారు.

రెండోవిడత గొర్రెల పంపిణీ

ముత్తారం: మండలంలోని పోతారంలో శనివారం రెండోవిడత గొర్రెలు పంపిణీ చేశారు. జెడ్పీచైర్మన్ ఆదేశాల మేరకు గ్రామంలోని లబ్ధిదారులు నెత్తెట్ల నర్సయ్య, సతీశ్, కట్ల రాజయ్య, చెల్కల కొమురయ్య, చేరాలు, అశోక్‌కు గొర్రెల యూనిట్లు పంపిణీ చేసినట్లు జెడ్పీటీసీ చెలకల స్వర్ణలత తెలిపారు. మండల పశువైద్యాధికారి అజయ్‌కుమార్, రేఖ, ఎంపీటీసీ సభ్యురాలు బియ్యని శ్యామల, సర్పంచ్ నెత్తెట్ల మహేందర్, ఉపసర్పంచు నరేందర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

✦నూతన నియామకం

కమాన్‌పూర్: కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా పేరపల్లికి చెందిన జంగపెల్లి ఎర్రయ్య, ఉపాధ్యక్షుడిగా గొల్లపల్లికి చెందిన చిగురు మొండయ్యను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు తెలిపారు.

✦పద్మశాలీ యుద్ధభేరి సభను విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: కోరుట్లలో 13వ తేదీన నిర్వహించనున్న పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పద్మశాలీ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండేటి రాజేశ్, యైటింక్లయిన్‌కాలనీ సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

✦నేడు పోస్టుమార్టం గది ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలో ఉన్న పోస్టుమార్టం గదిని ఆదివారం ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి తెలిపారు. పోస్టుమార్టం గదితో సుల్తానాబాద్‌తో పాటు ఓదెల, ఎలిగేడు, జూలపల్లి మండలాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పెదపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, డీసీహెచ్ డాక్టర్ శ్రీధర్ సూచన మేరకు పోస్టుమార్గం గదిని మరమ్మతు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు.

✦ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పాత శివాలయంలో అధిక శ్రావణమాసం చివరి రోజు ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ దంపతులు శనివారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజారులు వల్లకొండ మహేశ్, రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు.

✦నేడు జాబ్‌మేళా

ధర్మారం: మండల కేంద్రంలో 13న ఎల్ఎం ట్రస్టు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలో 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

✦వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో వాహనాలను శనివారం తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

✦పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గోదావరిఖని: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడు మహ్మద్ అబ్దుల్‌గఫార్‌కు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు శనివారం అందజేశారు. స్థానిక శివాజీనగర్‌కు చెందిన గఫార్‌కు చెందిన మొబైల్ పోయింది. దీనిపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ని గుర్తించినట్లు సీఐ పేర్కొన్నారు.

✦కాంగ్రెస్ సీనియర్ నాయకులకు సన్మానం

జూలపల్లి: 50ఏళ్లుగా పార్టీలో పదవులు ఆశించకుండా, సేవలు అందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంకటి భూషణం, అమరగాని లింగయ్యను కాచాపూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గండు సంజీవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మానుమండ్ల శ్రీనివాస్ సన్మానించారు.

✦మృతుడికి నివాళి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39 డివిజన్ గౌతమీనగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన నారాయణరెడ్డి పార్థివదేహానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ శనివారం నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మహంకాళి స్వామి, మారెల్లి రాజిరెడ్డి ఉన్నారు.